# గేదెలకు చెవులుంటాయ్



ఈకొద్దిరోజులలోనే మా కాలనీలో చాలా మార్పులోచేసినయ్. పోలీస్‌స్టేషన్ పెట్టిన నెలరోజుల్లోనే దానిని ఎత్తివేయాలంటూ మేము పెట్టుకున్న- అర్జీ మంత్రిగారికి ఎంచేతో నచ్చలేదు- పోలీస్ స్టేషన్ కావాలనటం- వద్దనటం అంతా మీ ఇష్టమేనా? ఒకసారి పోలీస్‌స్టేషన్ వచ్చిదంటే- లైఫ్ లాంగ్ ఇకపోదు" అది షుగర్ కంప్లెయింట్ లాంటిది!" అన్నారాయన. అయితే అదృష్టం కొద్దీ వేరే కారణాలవల్ల పోలీస్‌స్టేషన్ మా కాలనీకి దూరంగా ఉన్న భవనంలోకి మారింది.

ఇక రెండోమార్పు ఏమిటంటే జనార్ధన్‌కీ, యాదగిరికీ హఠాత్తుగా మద్రాసు నుంచి టెలిగ్రామ్ వచ్చింది. వాళ్ళిద్దరికీ తను డైరెక్షన్ చేయబోతున్న సినిమాలో మంచి వేషాలివ్వబోతున్నట్లు బోసుబాబు ఆ టెలిగ్రామ్‌లో తెలియజేశాడు. అప్పటికప్పుడే వాళ్ళిద్దరూ రడీ అయి మాద్రాసుకి బయల్దేరారు. మేమంతా స్టేషనుకి వెళ్ళాము సెండాఫ్ ఇవ్వడానికి. జనార్ధన్ నిజంగా ఎప్పట్నుంచో సినిమా హీరోనన్నట్లు ఫోజ్‌పెట్టి నిలబడ్డాడు ప్లాట్‌ఫారం మీద.

"ఏమిటో గురూ! జనంలో అందరితోపాటు కలసి రోడ్లవెంబడి తిరగే అవకాశం పోగొట్టుకుంటున్నాము–" అన్నాడు జనార్ధన్.

"ఎందుకని?"

"రేపో పిక్చర్ రిలీజయిందంటే– రోడ్డుమీదకు రావటం కుదరదుగదా! ఎక్కడికక్కడ జనం మూగిపోతారు. మనదేశంలో ఇదో పెద్ద హెడేక్. మా సినిమావాళ్ళకి అస్సలు స్వేచ్ఛ ఉండదు" అన్నాడు విచారంగా.

మాకు వళ్ళుమండిపోయింది వాడి వ్యవహారానికి. కానీ వెళ్ళేప్పుడు గొడవెందుకులే అని ఊరుకున్నాం.

ఈ రెండు మార్పుల తర్వాత కాలనీ ప్రశాంతంగా ఉన్నట్లనిపించసాగింది. కానీ ఓవారం అయినా గడిచీ గడవకముందే మా తాతయ్యకు సీరియస్‌గా ఉన్నట్లు ఉప్పుమంచి నుంచి టెలిగ్రామ్ వచ్చింది. కారంచేడు ప్రక్కనే ఉంది ఉప్పుమంచి గ్రామం. వెంటనే బయల్దేరి ఉప్పుమంచి చేరుకున్నాను. ఆ ఊరు నా చిన్నప్పటికీ ఇప్పటికీ అలాగే ఉంది. ఊరికి బస్సు, రైలు ఏమీలేవు. నేను బస్‌దిగే చోటకు మా బంధువు రామచంద్రం వచ్చాడు. చిన్నప్పుడు ఆ ఊళ్ళో వాడూనేనూ కలసి అయిదో క్లాస్ చదివాము. ఆ తరువాత వాడు చదువాపేశాడు.

తాతయ్య ఆ ప్రక్క ఊళ్ళోనే ఓ నర్సింగ్‌హోమ్‌లో ఉన్నాడు. నేనూ రామచంద్రం కలసి సైకిల్ మీద ఆ ఊరు చేరుకున్నాం అప్పటికే డాక్టర్లందరూ పెద్ద ఎత్తున డిస్కషన్స్ జరిపి "ఈ ముసలాయన ఇక బ్రతకడు తీసుకెళ్ళిపోండి" అని నోటీసిచ్చేశారు. మేమందరం కలసి తాతయ్యను ఓ బండిలో వేసుకుని 'ఉప్పుమంచి' చేరుకున్నాం. ఆయన ఆరోగ్యం క్షీణించిపోయింది గనుక మిగతా ఏర్పాట్లు చేస్తే బాగుంటుందని రామచంద్రంతో అన్నానుగాని, రామచంద్రం నవ్వేశాడు 'అదేం అవసరంలేదు' అన్నాడు. అంతలోనే తాతయ్యలేచి కూర్చున్నాడు.

మరో ఇరవైనాలుగ్గంటల్లో ఆయన పరిస్థితి ఇంచుమించుగా నార్మల్ కొచ్చేసింది.

"మరి డాక్టర్లలా చెప్పారేమిటి? ఆశ్చర్యంగా రామచంద్రాన్నడిగాను.

"మా డాక్టర్ల సంగతి నీకు తెలీదు! బ్రతకడు అంటే సేఫ్ అని అర్థం. అదే వాళ్ళు ఇంకేం ప్రాబ్లెమ్ లేదు– అంటే ఖాళీయేనని లెఖ్ఖ–" అన్నాడు నవ్వుతూ.

మేము మాట్లాడుతూండగానే "బాంక్ మేనేజరుగారొచ్చారు రమ్మని" మావాడికి కబురొచ్చింది.

"పదరా! అలా వెళ్ళొద్దాం!" అన్నాడు వాడు.

ఇద్దరం పంచాయితీ ఆఫీస్ దగ్గరకి వెళ్ళాం. ఆఫీసులో డి.ఆర్.టెలివిజన్‌సెట్ ఉంది. అప్పటికే ఆ వసారాలలో కొంతమంది ఊరివాళ్ళు కూర్చుని ఉన్నారు. వాళ్ళకెదురుగ్గా కుర్చీలో ఒకాయన పాంటూ బుష్‌షర్టూ వేసుకుని కూర్చున్నాడు.

"ఆయన కొత్తగా వచ్చిన బాంక్‌మేనేజరు!" నాతో చెప్పాడు రామచంద్రం.

సమావేశం ప్రారంభమయింది. మేనేజర్ గారు మాట్లాడడం ప్రారంభించారు. "మీ ఊళ్ళో పాతికమందికి బ్రతుకు తెరువుకోసం-20 సూత్రాల పథకం కింద-గేదెలు కొనుక్కోవడానికి మా బాంక్ అప్పులివ్వడానికి నిశ్చయించుకుంది!" అన్నాడతను.

అందరూ పెద్దెత్తున కరతాళ ధ్వనులు చేశారు. విలేజ్‌డెవలప్‌మెంట్ ఆఫీసర్ వచ్చి ఎవరెవరికి అప్పులిస్తోందీ చదివాడు. అందరూ మళ్ళీ తప్పట్లు కొట్టారు. ఓ మూల నుంచి ఓ యువకుడు లేచి నిలబడి గట్టిగా అరచాడు.

"అన్యాయం! వాళ్ళందరి దగ్గరా లంచం తీసుకుని మీరువాళ్ళకు అప్పులిస్తున్నారు-"

"ష్! ఎవరది- పెద్దాచిన్నా లేకుండా మాట్లాడుతున్నారు?" కోపంగా అన్నాడు మేనేజర్.

"నేనే!" అంటూ ముందుకొచ్చాడతను "అందరితోపాటు నేనూ అప్పుకోసం రాశాను. వాళ్ళకెందుకిస్తున్నారు, నాకెందుకివ్వటంలేదు? ఈ విషయమంతా ఇవాళే మనకేంద్ర డిప్యూటీ మంత్రి జనార్ధన్ పూజారికి రాస్తాను-"

ఆడైలాగ్ బాగానే పనిచేసినట్లుంది. మేనేజర్ కర్చీఫ్‌తో మొహం తుడుచుకున్నాడు.

"లోన్స్ మేము అందరికి ఇవ్వటం కుదరదయ్యా! ఎవరెవరి పరిస్థితులెలా ఉన్నాయో గమనించి ఎంతో అవసరం ఉన్నావారిని మాత్రమే ఎన్నుకున్నాము."

"అదే జనార్ధన్ పూజారికి రాస్తాను-"

దాంతో వి.డి.వో. కల్పించుకోక తప్పలేదు

"ఇదిగో- గణపతీ నీకు నుయ్యి తవ్వుకోటానికి అప్పు ఇప్పిస్తాన్లే! అందరికి పశువుల మీద అప్పుకావాలంటే ఎలా?" సర్ధిచెప్పబోయాడతను.

"అదివరక్కూడా నాకు నుయ్యి తవ్వే అప్పే యిప్పించావ్! ఇప్పుడూ మళ్ళీ అదే ఇస్తానంటున్నావ్! ఏం? నేనంతపనికిరాని వాడినయిపోయానా? నాకు మాత్రం గేదెలోన్ తీసుకోవాలని ఉండదూ? నాకు మాత్రం పెళ్ళాం బిడ్డలులేరనా? నాకు మాత్రం ఐదు-పది లక్షలు సంపాదించుకోవాలనుండదా?"

వి.డి.ఓ.కి.కోపం ముంచుకొచ్చింది.

"ఇదిగో గణపతీ! మర్యాదగా మాట్లాడు! నాలుగేళ్ళ క్రితం నీకు పొలం లేకపోయినా దొంగపట్టామీద ఎగ్రికల్చరల్‌లోన్ ఇప్పించలేదూ? విశ్వాసం లేకుండా మాట్లాడతావేం?"

"ఊరికే ఇప్పించావేమిటయ్యా? ఎవరి కమీషన్ వాళ్ళకిచ్చాను గదా!"

ఈలోగా మిగతావాళ్ళు కొంతమంది కల్పించుకుని గణపతికి నచ్చజెప్పబోయారు.

“నాకిదంతా అనవసరమయ్యా! కోళ్ళపారానికి నాక్కూడా అప్పు ఇస్తానంటేనే ఊరుకుంటా! లేకపోతే కలెక్టరుగారికీ, మినష్టరుగారికీ రాసేది ఖాయం–”

బాంక్ మేనేజర్ ఉలిక్కిపడ్డాడు.

“కోళ్ళఫారం అంటే మాటలతో ఉందేమిటి? ఎవరైనా మాపైవాళ్ళు ఇన్‌స్పెక్షన్‌కొస్తే పాతిక్కోళ్ళన్నా కనబడాలా. నువ్ నిజంగా కోళ్ళఫారం పెడతానని చెప్పు– తప్పకుండా లోన్ ఇప్పిస్తాను–” అన్నాడు ఆందోళనగా.

“నిజంగా కోళ్ళఫారం పెట్టేట్లయితే నువ్విచ్చేదేమిటయ్యా! రామ్ భరోసా బాంక్ వాళ్ళు ఎంత లోన్ కావాలంటే అంత ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారు–”

ఇక లాభంలేదని రామచంద్రం వెళ్ళాడతని దగ్గరకు.

అయిదు నిముషాలు ఇద్దరూ రహస్యంగా మాట్లాడుకున్నాక గణపతి మొఖంలోకి చిరునవ్వు తొంగిచూసింది.

“నిజంగా నాకు ‘బందిపోట్స్ బాంక్’ వాళ్ళతో గొఱ్ఱెల లోన్ ఇప్పిస్తావా?”

“తప్పకుండా ఇప్పిస్తానంటున్నాను కదా! గొఱ్ఱెల పెంపకం పథకం కింద బోలెడు డబ్బు అలా ఉండిపోయిందట. వెంటనే ఎవడో ఒకడికి అప్పు ఇవ్వకపోతే మేనేజర్ ఉద్యోగం వూడిపోతుంది– తెలుసా?”

“అంటే– మిగతా లోన్స్‌లాగా, గొర్రెలు కొనకుండానే కొన్నట్లు నాటకమాడిలోన్ తీసుకొవచ్చుకదా?” అనుమానంగా అడిగాడు గణపతి.

“మరీ కొనకపోతే బాగోదురా! వందగొర్రెలకు ఋణం తీసుకుంటున్నప్పుడు ఒకటిరెండు మేకలయినా కనిపించాలి! వాళ్ళకెలాగూ మేకలకూ గొర్రెలకూ అంతగా తేడా తెలీదులే! ఏం ఫర్వాలేదు–”

గణపతి వెళ్ళిపోయాడు.

నాకక్కడి వ్యవహారాలన్నీ చూస్తూంటే మతిపోతోంది. మేనేజర్ మళ్ళీ మాట్లాడాడు.

“రేపే మనం గేదెలను కొనే నిమిత్తం కంకిపాడు సంతకు బయల్దేరుతున్నాం. మీరందరి తరపునా ఒకరిని ప్రతినిధిగా మాతో పంపుతే మేము గేదెలు కొనుక్కుని తిరిగివస్తాం–”

“రామచంద్రమే వస్తాడు” అంటూ అరచారందరూ.

“నీకు ఈ వూర్లో మంచి పలుకుబడి ఉన్నట్లుందే?” అడిగాను రామచంద్రాన్ని. వాడు నవ్వేశాడు.

“అదేం కాదులే! ఇలాంటి వ్యవహారాల్లో నాకు ఎక్కువ అనుభవం ఉంది! అందుకని నేనంటే మంచి గురివాళ్ళకు–”

"గేదెలు కొనడానికి పెద్ద అనుభవం కావాలా?" నవ్వుతూ అడిగాను.

"ఆ అనుభవం కాదులేరా! రేపు నువ్వూ వస్తావుగా మాతో! అక్కడ చూద్దూగాని...."

ఇద్దరం సమావేశం ముగియగానే తిరిగివచ్చాం.

తాతయ్య హుషారుగా మాట్లాడుతున్నాడిపుడు.

"నేను టపా కట్టేస్తానని చెప్పారట ఆ నర్సింగ్‌హోమ్ వాళ్ళు! వాళ్ళందరూ టపాకట్టాల్సిందే నా కంటిముందు–"

నేనూ, రామచంద్రం, మిగతా బంధువులూ, కలిసి మళ్ళీ తాతయ్యను నర్సింగ్‌హోమ్‌కి తీసుకెళ్ళాం.

డాక్టర్లందరూ తాతయ్యను చూసి భోరున ఆశ్చర్యపోయారు.

"మేము స్వయంగా దగ్గరుండి ట్రీట్‌మెంట్ ఇచ్చి బ్రతకడని చెప్పినా ఈ కేసు ఎలా బ్రతికాడు? ఖచ్చితంగా బ్రతుకుతాడు అని చెప్పినకేసేమో ఇందాకే పైలోకానికి వెళ్ళిపోయింది! భలే తమాషాగా ఉందే!" అన్నారు విస్తుపోతూ.

వెంటనే తాతయ్యను మళ్ళీ పరీక్షించి మళ్ళీ అరడజను రకాల టాబ్‌లెట్లు, ఇంజక్షన్లు, టానిక్కులు రాసిచ్చారు.

"వెంటనే వెళ్ళి ఇవి పరమేశ్వరా మెడికల్‌షాప్‌లోనే కొనుక్కురండి! వేరేచోట కొనవద్దు!" అన్నాడు డాక్టరు.

"పరమేశ్వరా మెడికల్ షాపువాడు వీళ్ళకి బోలెడు కమీషన్ ఇస్తాడు! అందుకే అక్కడ కొనమంటారు! కిందటేడు దీపావళికి డాక్టర్లందరికీ తలోకారు బహుమతిగా ఇచ్చాడు–" అన్నాడు రామచంద్రం నాతో.

"నాలుగుకార్లు బహుమతిగా ఇచ్చేంత బిజినెస్ ఇచ్చారన్నమాట వీళ్ళు–" ఆశ్చర్యంగా రామచంద్రం దగ్గరున్న మందుల కాగితం తీసుకుని చూశాను.

బి.సి. ఫోర్ట్‌కాప్స్యూల్స్, బికాంప్లెక్సు ఇంజక్షన్లూ మల్టీవిటమిన్ టానిక్‌లు చాలా రకాలు ఉన్నాయ్.

"ఇదేమిటి– ఇవ్వన్నీ ఒకటే కదా! ఇన్ని రకాలుగా రాశాడెందుకు?" ఆశ్చర్యంగా అడిగాను రామచంద్రాన్ని.

"ఇవ్వన్ని ఒకటే మందా?"

"అసలది మందుకాదు. బలానికి ఉపయోగించేవి. వీటిల్లో ఏ ఒక్కటి వాడినా చాలు. కావాలని ఇన్ని రకాలు రాశారు–"

ఇద్దరం మళ్ళీ డాక్టర్ల దగ్గరికి నడిచాము.

"ఇదేమిటి డాక్టరుగారూ– బి కాంప్లెక్స్ ఇన్ని రకాలవి రాశారు! ఏదయినా ఒక్కటి సరిపోతుంది కదా!"

డాక్టర్ నావేపు చిరాగ్గా చూశాడు.

"నేను డాక్టర్నా– నువ్వు డాక్టరువా?"

"మేరే డాక్టరండీ!"

"అయితే నువ్వెందుకు వెధవ్వాగుడు వాగుతున్నావ్? ఏదివ్వాలో, ఏదివ్వకూడదో నాకు తెలుసు. ముందవన్నీ కొనండి! ముసలాయన త్వరగా కోలుకుంటాడు."

ఇద్దరం మెడికల్ షాపుకెళ్ళి అవ్వన్నీ కొన్నాం. నాకు తెలుసు, అవన్నీకొనటం వృధా అని!

కేవలం మెడికల్‌షాపులోని స్టాక్ ఎక్కువమందితో కొనిపించటమే ఆ డాక్టర్ల ఉద్దేశ్యం.

నేనూ, రామచంద్రం, పశువుల డాక్టరూ, విలేజ్ డెవలప్‌మెంట్ ఆఫీసరూ మర్నాడు తెల్లవారుజాముననే బయలుదేరి కంకిపాడు చేరుకుని ఓ హొటల్లో దిగాము.

అందరికీ బస్ టిక్కెట్లూ, హొటల్ బిల్లులూ రామచంద్రమే కట్టాడు.

కంకిపాడు ఊరంతా చాలా రద్దీగా ఉంది. ఎటు చూసినా సంతకుపోయే పశువులే. శుభ్రంగా రకరకాల ఫలహారాలు తిని అందరం సంతకు బయలుదేరాం. రామచంద్రాన్ని చూడగానే ఇద్దరు వ్యక్తులు వచ్చి అతనని చుట్టేశారు.

"మా దగ్గరే కొనండి రామచంద్రం గారూ! కిందటిసారి కూడా మీకు నమ్మకంగా ఇచ్చాను గేదెలను, గుర్తుందికదా! అన్నాడొకతను.

"ఈసారి మా దగ్గరకొనండి రామచంద్రంగారు! అన్నీ ఫస్ట్‌క్లాస్ గేదెలు. పూర్తిగా రెండు చెవ్వులతో ఉన్నాయి. ఒక్కొక్కచెవీ అరవైసార్లు కట్ చేయడానికి పనికొస్తుంది!" అన్నాడు ఇంకొకతను.

"మా గేదెల్నేకొనండి రామచంద్రంగారూ! ఒక్కొక్క గేదెకూ ఈసారి వెయ్యిరూపాయ లిస్తాను–" అన్నాడు మొదటివాడు.

"నేను పన్నెండు వందలిస్తాను"

"నేనూ పన్నెండు వందలిస్తాను"

"నేను పన్నెండొందల పాతికిస్తాను"

"నేనూ పన్నెండొందల పాతికిస్తాను"

"నేను పన్నెండొందల యాభైఇస్తాను"

"ఏయ్! నీకేం మతిపోలేదుగదా! నీ స్వార్థం కోసం మనలో మనమే పోటీపడితే ఇద్దరికీ నష్టం కలగదూ?" వాళ్ళల్లో ఒకడు కోపడ్డాడు.

"నువ్వే పోటీకొచ్చావ్!"

"నువ్వే వచ్చావ్–"

రామచంద్రం వాళ్ళిద్దరినీ సమాధానపరచాడు.

"అలా కొట్టుకోకండయ్యా! మీ ఇద్దరూ ఒకటేననీ కేవలం నన్ను బోల్తా కొట్టించడానికే ఇలా నాటకమాడుతున్నారనీ నాకు తెలుసు. మొదటిసారి ఒక్కొక్క గేదెకూ పదహారు వందలిచ్చారు–"

"పదాహారా?" ఇద్దరూ ఆశ్చర్యపడ్డారు.

రామచంద్రం వాళ్ళను లెఖ్ఖ చేయకుండా ముందుకి నడిచాడు. నేనూ అతన్ని అనుసరించాను. నాకు వాళ్ళ వ్యవహారం భాష– ఏమి అర్థం కావటంలేదు. లావుగా, బలంగా ఉన్న గేదెలు బోలెడున్నాయ్‌గానీ రామచంద్రం వాటివంకయినా చూడటంలేదు. అందరం వెళ్ళిబాగా ఎండిపోయి, కళ్ళల్లో ప్రాణాలు నిలుపుకుని ఉన్న గేదెల దగ్గర ఆగాము. వాటి తాలూకా బ్రోకర్ పరుగుతో వచ్చాడు మా దగ్గరకు. "ఫస్ట్‌క్లాస్ గేదెలుసార్! రెండు చెవ్వులూ పూర్తిగా ఉన్నాయ్! పెద్ద పెద్ద గేదెలు, పూటకి ఎనిమిది లీటర్ల పాలు ఇస్తాయ్! అంటే రోజుకి పదహారు లీటర్లపాలు అమ్ముకోవచ్చు–"

రామచంద్రం సంబరంగా నావేపు చూశాడు.

"చూశావా! ఇలాంటి గేదెలేకావాలి మనకు–" అన్నాడు.

"నీకేం మతిపోలేదుకదా! చచ్చేట్లున్న ఈ గేదెలు ఎవరయినా కొంటారా?"

"మాలాంటి బాంక్‌లోన్ వాళ్ళందరం ఇలాంటివాటినే ఎన్నుకుంటాం!"

"అవి వాడు చెప్పినట్లు నిజంగా ఎనిమిది లీటర్ల పాలిస్తాయని నీ నమ్మకమా?"

"పావు లీటరులో సగం కూడా ఇవ్వవని తెలుసు?"

నేనేమీ మాట్లాడలేదిక.

"ఎంత?" అడిగాడు రామచంద్రం ఆ బ్రోకర్‌ని.

"పదిహేనువందలిస్తాను!"

"రెండు వేలిస్తావా?"

అతను ఓ క్షణం ఆలోచించాడు.

"పద్దెనిమిది వందలిస్తాను–"

"రెండు వేలివ్వకపోతే అఖ్ఖర్లేదు–"

"వీటికి పూర్తి చెవులున్నాయండీ! పెద్ద పెద్ద చెవులు– చూస్కొండి "రామచంద్రం అదేమీ పట్టించుకోనట్లు నడవబోయాడుగానీ బ్రోకర్ అడ్డుపడ్డాడు.

"సరే తీసుకోండి!"

నేను దగ్గరకెళ్ళి వాటి చెవులను పరీక్షగా చూశాను. ఏమయినా ప్రత్యేకత ఉందేమోనని! కానీ నాకేం కనబడలేదు! రామచంద్రం ఉత్సాహంగా బాంక్ మేనేజర్ దగ్గరకు నడిచాడు.

"ఇవి బాగున్నాయ్‌సార్! రోజుకి పదకొండులీటర్లపాలు ఇస్తాయ్- వీటి వయసు కూడా చాలా చిన్నది!"

బాంక్ మేనేజరూ, విలేజ్ డెవలప్‌మెంట్ ఆఫీసరూ, గేదెల వంక చూశారు.

"అవును! బాగానే ఉన్నట్లున్నయ్!" అన్నాడు వి.డి.ఓ.

పశువుల డాక్టర్ గేదెల దగ్గర కెళ్ళి అన్నిటినీ పరీక్షించాడు.

"చాలామంచి గేదెలు!" అన్నాడు తిరిగివచ్చి.

"ఏమిట్రా ఇది? ఇవాళో రేపో చచ్చేట్లున్న ఆ ముసలి గేదెలను పట్టుకుని మంచి గేదెలంటారేమిటి అందరూ? పైగా అవి పదకొండు లీటర్లుపాలు ఇస్తాయని నువ్ కొత్త అబద్ధం చెప్తున్నావా?" రామచంద్రాన్ని రహస్యంగా అడిగాను.

"మీ సిటీ జనానికి బొత్తిగా బుర్రలుండవురా! అందుకే అలా ఫకీర్లలాగుంటారు" అన్నాడు నవ్వుతూ

"అయితే వాటిని రెండు వేలిచ్చి కొంటారన్నమాట మీరు!"

"వీటికి రెండువేలు ఇచ్చేది మేముకాదు! వీటిని కొన్నందుకు వాటి యజమానులే మాకిస్తారు ఒక్కొక్కగేదెకూ రెండువేలు చొప్పున-"

నాకు మళ్ళీ మతిపోయింది.

"అదేమిటి? వాళ్ళెందుకివ్వటం?"

"ఎందుకేమిటి? పోనీలే గదా అని మేము ఆ పనికిరాని గేదెలను కొనటం లేదూ?"

"కానీ దానివల్ల నష్టం మీకేగా?"

"ష్! అందుకే సిటీ బుర్రలు మట్టి బుర్రలన్నాను. అందుకే మీ నిర్భయ్‌గనర్‌కాలనీ గురించి అన్నిసార్లు పేపరులో రాస్తున్నారు-"

రామచంద్రం మళ్ళీ ఆ గేదెల బ్రోకర్ దగ్గరకు నడిచాడు.

"ఏం బాబూ! మరి మా అందరికీ ఖర్చులు కూడా నువ్వే ఇస్తావా?" బ్రోకర్ చిరాకుపడ్డాడు.

"కుదరదండీ! ఈ గేదెల్లో ఆ చివరినాలుగూ రోజుకి అర్ధపావుపాలు నిజంగా ఇస్తాయ్."

"వాటినెవడు కలపమన్నాడు ఈ ఎండిపోయిన గేదెల్లో?"

"ఈసారి ఎండిపోయినగేదెలెక్కడా దొరకలేదండీ! చాలా ప్రయత్నించాను. ఎక్కడా దొరకలేదనే నాలుగు పాలిచ్చేవాటిని కలిపితీసుకొచ్చాను-"

చివరకు ఖర్చులకు మరో అయిదొందలు అదనంగా ఇచ్చేందుకు వప్పుకున్నాడతను

బాంక్ మేనేజర్ వెంటనే తన దగ్గరున్న బాగ్‌లో నుంచి డబ్బుతీసి ఒక్కొక్క గేదెకు ఆరువేల చొప్పున లెక్కబెట్టి పాతిక గేదెల సొమ్మూ అతని కిచ్చేశాడు. ఆ బ్రోకర్ డబ్బు తీసుకుని మళ్ళీ ఒక్కొక్క గేదెకు రెండువేల చొప్పున యాభయ్‌వేల రూపాయలూ రామచంద్రానికిచ్చేడు. ఆపైన మా ఖర్చులకు ఇంకో అయిదొందలు కూడా ఇచ్చాడు. ఆ తరువాత మళ్ళీ బాంక్ మేనేజరూ, పశువుల డాక్టరూ, విలేజ్ డెవలప్‌మెంట్ ఆఫీసరూ విడివిడిగా ఆ బ్రోకర్‌ని పక్కకు తీసుకెళ్ళి రహస్యంగా మాట్లాడారు.

దానితో కొనుగోలు తతంగం పూర్తయింది. మేమంతా హొటల్‌కి వచ్చి మందూ, భోజనాలు కానిచ్చి తిరుగుముఖం పట్టాము.

"బస్‌లో మళ్ళీ వాడిని కదిపాను. "ఏమిత్రా– మీ వ్యవహారం నాకేం అర్థం కావటం లేదు– మీరసలు గేదెల్ని ఎందుకు కొన్నట్లు?"

"బాంక్ వాళ్ళు అప్పుతీసుకోమని బలవంతం చేస్తుంటే ఏం చేస్తాం మరి! మా వూరికి చుట్టు ప్రక్కలూళ్ళల్లో నాలుగు బాంకులున్నాయ్. ఎప్పుడూ ఏదొకలోన్ తీసుకోమని మమ్మల్ని వేధించుటకు తింటూంటారు వాళ్ళు–"

"అదేమిటి అడక్కుండానే అప్పులిస్తారా?"

"నీ మట్టిబుర్రతగలెయ్యా! అందుకే మీ కాలనీ అలా అఘోరించింది! నువ్ మీ కాలనీ కమిటీ వైస్ ప్రెసిండెంట్వికూడా! కదూ?"

"అవును"

"ఇంక మీ కాలనీ వాళ్ళను దేవుడే రక్షించాలి! నీకు తెలసో తెలీదో! ఒక బ్యాంకు మేనేజర్ ఏం చేశాడనుకున్నావ్? మా వాళ్ళందరికీ కోళ్ళఫారాని కోసం తలో యాభైవేలూ లోన్ ఇవ్వాల్సివచ్చింది. ఇవ్వకపోతే వాడి ఉద్యోగం గోవిందా కొడుతుంది! అవునా! ఆ పరిస్థితి అంతా చెప్పేసరికి సరే పోనీలెమ్మని జాలిపడి అప్పు తీసుకోవడానికి వప్పుకున్నాం! తీరా ఇచ్చేముందు ఏమన్నాడో తెలుసా కోళ్ళఫారం అంటే నిజంగా పెద్ద ఫారం లేకపోయినా కనీసం ఇంటికోపాతిక్కోళ్ళన్నా కనిపించాలి అని కండిషన్ పెట్టాడు. మాకు వళ్ళు మండిపోయింది. ఓ పక్క లోను తీసుకుని నిజంగా కోళ్ళు పెంచాలంటే ఎవడికయినా తిక్క పుట్టకొస్తుంది గదా! అందుకని నీ బోడిలోన్ మాకక్కర్లేదు పొమ్మన్నాం. అప్పుడు చూడాలి వాడి తిప్పలు! ఫలానా తారీఖులోపల ఆ డబ్బంతా అప్పుల ద్వారా పంచకపోతే వాడి ఉద్యోగం రా! ఇటేమో అందరం లోన్ అక్కర్లేదని తిరగబడ్డాం! చివరకు మా గడ్డం పట్టుకుని బ్రతిమాలాడు ఓ రోజంతా! వాళ్ళావిడా పిల్లలు కూడా మావూరొచ్చి దీనంగా నిలబడేసరికి మాకుజాలేసింది. సరే పోనీలెమ్మన్ని వప్పుకుని లోన్‌తీసుకున్నాం!"

"మరి పాతిక్కోళ్ళయినా ఉండాలన్న కండీషను మాటేమిటి?"

"ఆ కండీషన్ వదిలేసుకున్నాడు. అయితే ఎవరయినా పై అధికారులు ఇనిస్పెక్షన్ కొచ్చినప్పుడు మాత్రం ఎవరో ఒకరికోళ్ళు ఓ అరడజను తీసుకొచ్చి చూపించమన్నాడు–"

"ఇంతకూ మీరీగేదెల్ని ఎందుకు కొన్నట్లు?"

"అర్జంటుగా డబ్బు అవసరం వచ్చింది. మా ఉప్పుమంచిలో ఎవరికి డబ్బు అవసరం వచ్చినా బాంక్‌కెళ్ళి ఏదోక స్కీమ్ కింద అప్పుతీసేసుకుంటాం!"

"మరి తీర్చడం?"

రామచంద్రం విరగబడి నవ్వాడు.

"నీయవ్వ! అందుకే 'సిటీ' వోళ్ళంది. మరీ ఇంత దారుణమయినా మెదడు అనుకోలేదు బాసూ, మీది! బ్యాంక్‌లోన్లు ఎవరైనా తీరుస్తారా ఎక్కడయినా?"

"తీర్చకపోతే వాళ్ళూరుకుంటారా?"

"ఏం చేస్తారేమిటి? ఇప్పటికి మేము అరడజనుసార్లు బాంక్ అప్పులు ఎగ్గొట్టాము. అప్పులకింద లాక్కోడానికి మా దగ్గరేముందని! మా ఇళ్ళే ఉన్నాయ్! అవేమో ప్రభుత్వం కట్టించిన ఇళ్ళాయె! వాటిని తీస్కుంటే రాష్ట్ర ప్రభుత్వం ఊరుకోదుగదా! ఒక అర్జీకలెక్టరికీ, ముఖ్యమంత్రికీ, కేంద్రమంత్రికీ కొట్టామంటే బాంకోళ్ళు తోక ముడుస్తారు."

"పోనీ ఎలాగూ బాంక్ వాళ్ళు మీకు గేదెలు కొనిస్తున్నప్పుడు, మంచిగేదెలు కొనుక్కుంటే మీకు లాభంగా ఉంటుంది కదా–"

వాడు నన్నోవాజమ్మను చూసినట్లు చూశాడు.

"గాడిదగుడ్డు లాభం! మా ఊర్లోపాలెవరు కొంటార్రా? ఇక మేమే తాగాలి రాత్రిం బవళ్ళు! అయినా ఆ గేదెలలా మా దగ్గరేపడుంటే మళ్ళీ మళ్ళీ మాకు అప్పులెవరిస్తారు? నీ సిటీ మెదడు అస్సలు లాభం లేదురా–"

రెండోరోజునే ఆ గేదెలన్నీ మా ఊరికి చేరుకున్నాయి. గేదెలతోపాటు అందరికీ తలో రెండువేలూ పంచాడు రామచంద్రం. గేదెలన్నింటికి చెవులకు చిల్లులు పొడిచి టోకెన్లు కట్టారు. టోకెన్లు మీద "బోగస్ బాంక్‌వారి గోవు" అని రాసి ఉంది.

రెండు రోజుల తర్వాత తాతయ్యను మళ్ళీ నర్సింగ్ హెూమ్‌కి తీసుకెళ్ళాము. అన్ని పరీక్షలూ జరిపి– మళ్ళీ బలానికి ఎనిమిది రకాల టానిక్కులూ, టాబ్లెట్లూ, కాప్సూల్స్ రాశాడు డాక్టరు.

"ఇవ్వన్నీ వాడండి! ఇవి వాడటం చాలా అవసరం! శుభ్రంగా లేచి తిరుగుతారు. మళ్ళీ వారం రోజుల తర్వాత తీసుకురండి!" అన్నారువాళ్ళు.

"మాదొచిన్న రిక్వెస్టండీ" అన్నాన్నేను.

"ఏమిటో చెప్పండీ!"

"మీక్కావలసింది ఈ టానిక్‌లన్నీ మేము కొనడం వల్ల మీకొచ్చేకమీసన్ పెరగాలనే కదా! ఆ మొత్తం ఏదో చెప్తే మేమే మీ కిచ్చేస్తాం. అనవసరంగా ఆ చెత్తంతాకొనకుండా ఉంటే మాకూ లాభం– కమీషన్ ముట్టడం వల్ల మీకూ లాభం! ఎలా వుందంటారు?"

"ఏడ్చినట్లుంది!" అన్నాడు డాక్టరు.

"ఎందుకనండీ?"

"ఇలాగయితే మాకొచ్చే ఫ్రీశాంపుల్స్ ఎలా అమ్ముకోవటం?"

" ఆ టానిక్‌లూ అవీ మీరేమీ ఇంట్లోకి వాడుకోవచ్చు గదండీ! అసలే సన్నగా ఉన్నారు మీరు–"

"టానిక్‌లు తాగితే బలం వస్తుందేమిటి మీమొఖం! అవన్నీ తాగుతే లేనిపోని సైడ్ ఎఫెక్ట్స్‌కూడా వస్తాయ్– వెళ్ళండి– ముందు అవన్నీకొనండి–" అవన్నీ కొనుక్కుని ఇంటికి చేరుకున్నాము.

పది రోజులయిపోయింది. తాతయ్య పరిస్థితి పూర్తిగా బాగయిపోయింది. వచ్చిన బంధువలంతా తిరుగుముఖం పట్టారు.

ఆ రోజు మధ్యాహ్నం నేను రామచంద్రం కోసం వూళ్ళోకి వెళుతుంటే ఆరోజు కంకిపాడులో మాకు గేదెలమ్మిన బ్రోకర్ కనిపించాడు.

నన్ను చూస్తూనే గుర్తుపట్టాడతను.

"మీరు బ్యాంకు మేనేజరుగారు కదండీ! నమస్కారం!"

"కాదండీ! రామచంద్రం ఫ్రెండ్‌ని!"

"ఓహో– అలాగా–అవుల్లెండి! ఆ రోజున వచ్చారుకదూ! రామచంద్రం ఎక్కడున్నారండీ–"

"పంచాయితీ ఆఫీస్ దగ్గర! నేనూ అక్కడికే వెళ్తున్నా పదండి!" ఇద్దరం బయల్దేరాము.

"మీరు మళ్ళీ వచ్చారెందుకు?" అడిగాను అనుమానంగా.

"అదే! మా గేదెల్ని తోలుకుపోదామని!"

"మీగేదెలా?"

"అవున్సార్! అమ్మాముకదా! అవే!"

"అవి మీవెలా అవుతాయ్? వీళ్ళు కొన్నారుగా?"

"నేను కాదనటం లేదు కదండీ! ఇప్పుడు మళ్ళీ వాటిని కొనుక్కుపోదామని వచ్చాను–" నాకు మతిపోయినట్లయింది.

"మళ్ళీ మీరు కొనటం ఎందుకు?"

"ఎందుకేముందిసార్! ఏదో పొట్ట తిప్పలు! మీకు తెలీందేముంది?" నవ్వుతూ అన్నాడతను

నాకేం అర్థం కావటంలేదు. రా[నాను ఈ గేదెలొక పెద్ద మిస్టరీ అయిపోతున్నాయ నిపించింది.

పంచాయితీ ఆఫీస్ దగ్గర రామచంద్రం కొలువు తీరి కూర్చుని ఉన్నాడు. గేదెల్నికొన్న పాతికమంది అతని చుట్టూ మూగి అతను చెప్పే మాటలు శ్రద్ధగా వింటున్నారు.

"అదుగో-గేదెల పెద్దమనిషిరానే వచ్చాడు-" అన్నాడు రామచంద్రం నాపక్కనున్న ఆసామీని ఆనందంగా చూస్తూ.

అందరూ ఆనందంగా అతనివేపు చూశారు.

మేమిద్దరం వెళ్ళి రామచంద్రం పక్కన కూర్చున్నాం.

"ఎంతకిచ్చేద్దామంటారు చెప్పండి!" అడిగాడు రామచంద్రం వాళ్ళను. "వెయ్యి రూపాయలకు తక్కువలేదు-" అన్నాడొకతను.

"అవును! వెయ్యిరూపాయలకు ఒక్క పైసాకూడా తగ్గటానికి వీల్లేదు-" ఇంకొకతను కూడా అన్నాడు.

రామచంద్రం ఆగేదెల ఒరిజినల్ ఓనర్‌వేపు చూశాడు.

"మావాళ్ళు వెయ్యిరూపాయలకు తగ్మంటున్నారు మరి-"

"అయ్యా! నేను ఎనిమిది వందలకంటే ఎక్కువివ్వలేనండి! అన్నాడు గేదెల ఓనర్ బ్రతిమాలుతూ!

"ఇవ్వకపోతే పోనీండీ- ఏం చేస్తాం" ఆ వ్యక్తి లేచి నిలబడ్డాడుగానీ, అతనికీ వెళ్ళబుద్ధి కావటం లేదు.

"పోనీ ఎనిమిదివందల యాభయ్ చేసుకోండి"

"కుదరదయ్యా! వేరే వాళ్ళు వెయ్యి రూపాలిస్తామంటున్నారు-" అన్నాడు రామచంద్రం ఖండితంగా.

అతను ఇంకాసేపు ఆలోచించాడు.

"సరే కానీండి! తప్పేదేముంది?"

అందరూ ఆనందంగా అతనిచుట్టూ మూగారు. ఒక్కొక్కరికి వెయ్యిరూపాయల చొప్పున లెక్కగట్టి ఇచ్చేశాడతను.

"మరి పశువుల డాక్టరూ, వి.డి.వో. బాంక్‌మేనేజర్ల మాటేమిటి?" అడిగాడు రామచంద్రం.

"అదంతా నేను చూచుకుంటా గదయ్యా-"

మరికొద్దినిమిషాల్లో అందరూ తాము కొన్న గేదెలను తీసుకొచ్చి వరుసగా నిలబెట్టారు. ఓ పెద్ద కత్తెర తీసుకొచ్చాడు రామచంద్రం. వాటి చెవులకున్న టోకెన్లవరకూ చెవిముక్కలు కత్తిరించి ఆటోకెన్లన్నీ ఓ సంచిలోవేశాడు.

గేదెల ఓనర్ ఆ గేదెల్ని తోలుకెళ్ళిపోయాడు.

"ఆగేదెల్ని అతనికెందుకు అమ్మారు మళ్ళీ?" రామచంద్రాన్ని అడిగాను ఆశ్చర్యంగా.

"డబ్బు వస్తుందికదా– అందరికీ పొద్దున్న పొద్దున్నే తలోవెయ్యీ వచ్చిందా లేదా–"

"వచ్చింది–"

"అద్గది సంగతి– మనక్కాలసింది కాష్– అంతే! పద! పశువుల డాక్టర్ ఇంటికెళ్దాం–" అన్నాడతను.

అందరం కలసి పశువుల డాక్టర్ ఇంటికీ వెళ్ళాము. అందర్నీ చూడగానే డాక్టర్ మొఖం ఆనందంతో వెలిగిపోయింది.

"గేదెలు అన్నీ చచ్చిపోయాయా?" అడిగాడు సంబరంగా.

"చచ్చిపోయాయండి!"

"ఒక్కటి కూడా మిగల్లేదు కదూ?"

"ఒక్కటి కూడా మిగల్లేదండి!"

"వాటికి ఆ పాడు జబ్బు చేస్తే అంతే! ఒకే రోజున చచ్చిపోతాయ్–"

"అవునండీ– వెధవ జబ్బు–"

"మరి వాటినేం చేశారు?"

"పాతేశామండీ!"

"మరి వాటి చెవులకున్న టోకెన్లు కత్తిరించారా?"

"ఇవిగో– తెచ్చామండి–" అంటూ సంచీలో నుంచి టోకెన్లతో సహా ఉన్న చెవి ముక్కలు క్రుమ్మరించాడతను.

డాక్టరు ఆనందంగా చూశాడు వాటివేపు.

"సర్టిఫికేట్స్ వారం క్రితమే రడీచేశాను– ఇవాళ్ళ తారీఖువేసి ఇచ్చేస్తాను–" అంటూ లోపలికెళ్ళి ఓ ఫైలు తీసుకొచ్చి సంతకాలు చేయడం ప్రారంభించాడు.

"వారం క్రితమే చచ్చిపోయుంటాయనుకున్నాను! ఈసారి ఆలస్యమయిందేం? ఇంతకుముందు కొన్నగోవులన్నీ కొన్ననాలుగురోజులకే చచ్చేవికదా!" అడిగాడాయన.

"గేదెల ఓనరికి పాపం డబ్బు దొరకలేదండీ! అందుకని ఆలస్యంగా ఇందాకే వచ్చాడు! రాగానే చచ్చిపోయినాయ్–"

సర్టిఫికెట్లు తీసుకుని బాంక్ మేనేజర్ ఇంటికెళ్ళాం అందరం మళ్ళీ ఊరేగింపుగా.

"అమ్మయ్య! చచ్చిపోయినాయ్య! గొడవ వొదిలిపోయింది. ఎల్లుండి మా వాళ్ళు ఇనిస్పెక్షన్ కొస్తున్నారు– ఆ గేదెల్ని చూస్తే మాట వస్తుందేమో అని ఒ హాటే భయపడుతున్నాను!" అన్నాడు బాంక్ మేనేజర్ ఆనందంగా. ఈలోగా విలేజ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ హడావుడిగా వచ్చాడు.

"ఇవాళైనా చచ్చిపోయినయ్యా?" అడిగాడతను రామచంద్రాన్ని.

"అవునండి!"

"రక్షించారు! ఏరోజు కారోజే ఎదుర్చూస్తున్నాను! అవతల అకస్మాత్తుగా మా పిల్లలకు పరీక్ష ఫీజులు కట్టాల్సి వచ్చింది– ఈ గేదెలు చావగానే ఫీజులు కట్టేయొచ్చుకదాని ఆశతో ఉంటే– వీటికేమో చావడానికి ఇన్ని రోజులు పట్టింది" అన్నాడతను అసంతృప్తిగా. సరిగ్గా అప్పుడే గణపతి వచ్చాడెక్కడినుంచో.

"నా సంగతేమిటీ మరి! ఈ గేదెల గొడవంతా అయిపోయాక నాకు లోన్ ఇస్తానన్నారుగా?" అన్నాడు దబాయింపుగా.

"వాడితో పేచీ ఎందకు? ఏదోక పాయింట్‌కింద ఇచ్చిపారేయండి. ఎంతోకంత!" అన్నాడు రామచంద్రం బాంక్‌మేనేజరుతో "మనకిచాలా పాయింట్లున్నాయిగా!"

మేనేజర్ ఓ అప్లికేషన్ ఫారం తీశాడు.

"దీనిమీద సంతకం పెట్టు!" అన్నాడతనితో.

గణపతి ఆ కాగితం తీసుకుని ఓసారి చూశాడు.

"పాతికవేలు లోన్ ఇస్తున్నట్లు రాశారు, అంతేనా" అడిగాడతను.

"అవును!"

"పాతికవేలు ముట్టినట్లు నేను సంతకం పెడితే నాకు కాష్‌గా ఎంత ఇస్తారు?"

"మామూలేగా– కొత్తగా అడుగుతావేం? పదిహేనువేల ఏడువందల యాభయ్ కాష్ ఇస్తాము–"

"మిగతాడబ్బు ఏమవుతుంది? మీరు తినేస్తారు కదా?"

"నాకక్కర్లేదయ్య బాబు– మిగతా డబ్బు నువు తిరిగిచెల్లించినట్లు జమవేసుకుంటాం! ఎందుకంటే నీకిచ్చే పదిహేనువేల ఏడువందల యాభయ్ రూపాయలూ ఐ.ఆర్.డి.పి. వాళ్ళు మాకు సబ్సిడీగా ఇచ్చేస్తారు– కనుక మిగిలింది నువ్వు కట్టేసినట్లు చూపిస్తే– ఆ ఎకౌంట్ వ్యవహారం క్లోజ్ అయిపోతుంది. ఎవరికీ నష్టంలేదు. నన్ను కూడా మా బాంక్ అధికారులు మెచ్చుకుంటారు– లోన్ అంతా రికవర్ చేసినందుకు!"

"నువు వచ్చినంత తీసుకుని సంతకం పెట్టరా– అవన్నీ నీకెందుకు?" అన్నాడు వి.డి.వో. చిరాకుగా.

గణపతి సంతకం పెట్టి చెక్కు తీసుకుని వెళ్ళిపోయాడు. అందరం ఇళ్ళకు బయల్దేరాం.

సాయంత్రం తాతయ్యను మెడికల్ చెకప్ కోసం మళ్ళీ అదే నర్సింగ్ హోమ్‌కి తీసుకెళ్ళాం. అప్పటికప్పుడే ఎక్స్‌రేలు, స్కానింగ్‌లూ, ఇ.సి.జి., బ్లడ్ టెస్ట్ అన్నీ అయిపోయామ్.

"అన్నీ ఫరపెక్ట్‌గా ఉన్నాయ్. ఇంక మెడికల్ చెకప్ కూడా ఇప్పట్లో అవసరం లేదు! ఎందుకయినా మంచిది ఈ ఆరురకాల మందులు వాడండి–" అన్నారు నర్సింగ్‌హోమ్ డాక్టర్లు, వెయ్యి రూపాయలు ఫీజ్ తీసుకుని. ఆ ఆరూ ఆరురకాల టానిక్‌లు!

"అన్నీ బాగుంటే ఇంక ఇవెందుకు?" అడిగాను డాక్టర్‌ని.

"మెడిసిన్ మాకు తెలుసా? నీకు తెలుసా?" అడిగాడతను కోపంగా.

"మీకే తెలుసులెండి–"

"మరి తెలివితక్కువగా మీరెందుకు మాట్లాడుతున్నారు?"

మాట్లాడకుండా అన్నిటానిక్కులు కొనుక్కుని ఇంటికి చేరుకున్నాం.

మరో రెండురోజులు గడిచిపోయినాయ్. ఆ రోజు తెల్లారుజామునే బాంక్ మేనేజరు పరుగుతో వచ్చాడు మా ఇంటికి.

"రండి కూర్చోండి!" అన్నాడు రామచంద్రం.

"కూర్చోడానికి రాలేదు రామచంద్రం! కొంపలు అంటుకున్నాయ్ అవతల–"

"ఏం జరిగింది సార్?"

"ఫైనాన్స్ మినిస్ట్రీ అధికారులు, ఆర్.బి.ఐ. అధికారులు కలిసి మా బ్రాంచ్‌లోన్స్ ఇనిస్పెక్షన్ కొస్తున్నారట! అర్జంటుగా పాతికమందిని ఎవర్నయినా పట్టుకురా! తలో అయిదువేలూ ఇచ్చేస్తాను–"

రామచంద్రం విసుక్కున్నాడు.

"ఇలా హఠాత్తుగా చెప్తే ఎలా సార్! కొంచెం టైమిస్తే బాగుంటుంది. ఇప్పుడు ఎవరెక్కడ తాగి పడుకున్నారో తెలీదు–"

"బాబ్బాబు! నీకు రెండు పేర్లమీద పదివేలిస్తాను– త్వరగా తీసుకురా!" రామచంద్రంతో పాటు నేనూ బయల్దేరాను– మరో గంటసేపటికి పాతికమందిని పోగేసుకుని వచ్చాము. అందరికీ తలో అయిదువేలూ ఇచ్చేసి సంతకాలు తీసుకున్నాడు మేనేజరు.

"మరి పూచీకత్తు సంతకాలు అవసరం లేదూ?" అడిగాడు రామచంద్రం.

అయిదువేలకి పూచీకత్తులూ అక్కర్లేదు, సంతకాలూ అక్కర్లేదు. అసలు కాగితాలు కూడా అవసరం లేదు."

"మరి వాళ్ళు లోన్ ఎగ్గొడితే!" అడిగాను నేను.

"ఎగ్గొట్టనీయండి! ప్రజలసొమ్ము ప్రజలేతింటున్నారు– తప్పేముంది? మాకు ప్రభుత్వ ఆదేశాలు అలా వున్నాయ్–"

నాకు హఠాత్తుగా ఆశ పుట్టింది.

"అయితే నాకూ అయిదువేలిస్తారా?" అన్నాను ధైర్యం తెచ్చుకుని.

"మీకా–మీది ఊరుకాదుగదా?" అనుమానంగా అడిగాడతను.

"ఈ ఊరు వాడినేనని రామచంద్రం సాక్ష్యం ఇస్తాడు!"

మేనేజర్ రామచంద్రం వేపు చూశాడు.

"అవునండి– అందులో పెద్ద ఇదేముంది? ఓ అయిదువేలు ఇచ్చేయండి! పిల్లలుగలవాడు. పాపం!"

మేనేజర్ అయిష్టంగానే అయిదువేలకి చెక్‌రాసిచ్చి నా సంతకం తీసుకున్నాడు.

"రేపొద్దున్నే మనం కంకిపాడు వెళ్ళివద్దాం. మన వాళ్ళందరికీ గేదెలు కొనేస్తే మొత్తం లోన్స్ సబంధించిన డబ్బంతా ఖర్చు చేసినట్లయిపోతుంది– అన్నాడు మేనేజర్ రామచంద్రంతో.

నేను ఉలిక్కిపడ్డాను గానీ మాట్లాడలేదు.

మర్నాడు పొద్దున్నే రామచంద్రం కంకిపాడు వెళ్ళాడు. ఆ రెండో రోజున మేము పంచాయితీ ఆఫీస్ దగ్గర కూర్చున్నప్పుడు కంకిపాడు నుంచి గేదెలు వచ్చేసినయ్. వాటిని చూస్తూనే ఉక్కిరిబిక్కిరయ్యాను. అవే గేదెలు! కాకపోతే మరింత ఎండి– మరింత త్వరగా చచ్చేట్లు కనబడుతున్నాయ్. వాటన్నింటికీ కొంతబాగం చెవిముక్కలు ఇటీవలే కత్తిరింపబడినట్లు స్పష్టంగా తెలుస్తోంది.

"ఏమిటి? మళ్ళీ అవేగేదెలు కొన్నారా?" అడిగాను రామచంద్రాన్ని.

"అవును! ఈసారి ఒకోదానికి రెండువేల అయిదొందలవరకూ వచ్చింది కదా మరి! అంతరేటు ఇంకెవరూ ఆఫర్ చేయలేదు–" నాకు మతిపోయినట్లయింది.

ఆ రాత్రి తాతయ్య పరిస్థితి హఠాత్తుగా క్షీణించటం ప్రారంభమయింది. నర్సింగ్ హోమ్‌కి బయలుదేరాం. "ఆరోగ్యం ఫరఫెక్ట్‌గా ఉందన్నారు కదా! అన్ని పరీక్షలూ జరిపి?" ఆశ్చర్యంగా రామచంద్రంతో అన్నాను.

అంత సీరియస్ పరిస్థితిలో కూడా తాతయ్య నవ్వాడు.

"వాళ్ళు ఫర్‌ఫెక్ట్ అన్నారంటే తప్పక ప్రమాదం ముంచుకొస్తుందని నేను చెప్తూనే ఉన్నాను గదుట్రా!"

మరికాస్త దూరం వెళ్ళేసరికి తాతయ్యకు వెక్కిళ్ళు ప్రారంభమయాయ్. మాకు గాభరా ఎక్కువయింది.

మరికొద్ది క్షణాలు గడిచేసరికి తాతయ్య ప్రాణాలు కాస్తా పోయాయ్. నాడి పట్టుకుని చూసి "అయిపోయింది" అన్నాడు రామచంద్రం.

"వెనక్కు వెళ్ళిపోదామా?" అడిగాను

"ఇంతదూరం వచ్చాంకదా! నర్సింగ్ హోమ్‌లో చూపిద్దాం ఓసారి!" అన్నాడతను. నర్సింగ్ హోమ్‌కి చేరుకోగానే తాతయ్యను స్ట్రెచర్‌మీద ఎమర్జెన్సీ రూమ్‌లోకి తీసుకెళ్ళారు. ఇద్దరు డాక్టర్లు ఆయనను పరీక్షించటం ప్రారంభించారు.

"దారిలోనే ప్రాణం పోయింది" అన్నాన్నేను.

"ఆ విషయం చెప్పాల్సింది మేము–" అన్నాడు డాక్టర్. నేనిక మాట్లాడలేదు. అప్పటికప్పుడే మళ్ళీ పరీక్షలు ప్రారంభమయాయ్. స్కానింగ్, ఇ.సి.జి. ఎక్స్‌రేలు–

రెండుగంటల తర్వాత ఎమర్జెన్సీ రూమ్‌లోనుంచి బయటికొచ్చారు డాక్టర్లు.

"చనిపోయాడు తీసుకెళ్ళిపోండి–" అన్నాడు జాలిగా.

"ఆ సంగతి మేము అప్పుడే చెప్పాం కదా!" అన్నాడు రామచంద్రం.

"మీరు చెప్తే ఎలా కుదురుతందయ్యా– మేము చెప్పాలిగాని– పదివేల రూపాయలు ఈ టెస్ట్‌లన్నింటికి ఫీజుకట్టండి."

"కానీ చనిపోయిన వాడికి ఆ పరీక్షలన్నీ ఎందుకు చేసినట్లండీ?" అడిగాను ఆశ్చర్యంగా.

"మెడిసిన్ చదివింది మీరా మేమా?"

"మీరేనండి!"

"అయితే తలలేని ప్రశ్నలు మీరు వేస్తారెందుకు?"

"సారీ సార్! మీరే వేయాలి!" డబ్బు కట్టి ఇంటికి చేరుకున్నాం! నా ప్రయాణం మరో వారం రోజులు వాయిదా పడింది. బాంక్ అధికారులు, కేంద్రం ఫైనాన్స్ మినిస్ట్రీ అధికారులు ఊరికి విచ్చేశారు.

పెద్దెత్తున లోన్‌మేలా ఫంక్షన్ ఏర్పాటుచేశారు రెవిన్యూ అధికారులు.

ఊళ్ళో మరికొంతమందికి చెప్పులు కుట్టుకునే మిషన్లు, కొంతమందికి మంగలిసాపు పెట్టుకోవడానికీ, మరికొంతమందికి చేపలు పట్టుకునే వలలు కొనుక్కోవడానికీ అప్పులు పంచిపెట్టారు వాళ్ళు. జనగణమన పాడాక ఎవర్దారిన వాళ్ళు వెళ్ళిపోయారు. మర్నాడే ఆయా మిషన్లు, మంగలిసాపు పరికారాలు, చేపలు పట్టే వలలూ అన్నీ రామచంద్రం సాయంతో పట్నంలో అమ్మివేసి డబ్బుతీసుకుని ఆనందంగా తిరిగివచ్చారువాళ్ళు.

నేను ఆరోజు ఉదయమే హైదరాబాద్ ప్రమాణమయ్యాను. రామచంద్రం నన్ను బస్ ఎక్కించడానికి తనూ బయల్దేరాడు.

ఇద్దరం పంచాయితీ ఆఫీస్ దగ్గరకొచ్చేసరికి అక్కడ వారం క్రితం ఉన్న అవే గేదెలు మళ్ళీలైనుగా నిలబడి ఉన్నాయ్. వాటి చెవుల సైజు ఇంకొంత తగ్గిపోయింది ఇప్పుడు! ఆ గేదెలు అమ్మినబ్రోకరు ఆనందంగా వాటిని తోలుకెళ్ళడానికి సన్నాహాలు చేస్తున్నాడు మళ్ళీ.

"ఇలా ఎన్నిసార్లు వీటినికొని అమ్ముతారు?" అడిగాను రామచంద్రాన్ని వాడు నా వంక హేళనగా చూశాడు.

"మీ సిటీవాళ్ళకు బొత్తిగా బుర్రలుండవ్‌రా! అందుకే మీ కాలనీ అంతా నవ్వుల పాలవుతోంది! ఎన్నిసార్లు కొనడమేమిట్రా! బాంక్‌లో అప్పులకోసం కేటాయించిన మొత్తం అయిపోవాలి! లేదా ఆ గేదెల చెవులు మొత్తానికి తెగిపోవాలి! ఏదిముందు జరిగితే అది! అప్పుడు వాటి క్రయవిక్రయాల కార్యక్రమం ముగుస్తుందన్నమాట! అప్పుడుగానీ కొత్త గేదెల బ్యాచీ బయటకు రాదు- ఫుల్ చెవుల్తో."

"అంతవరకూ ఇలా కొనడం- అమ్మడం జరుగుతూనే ఉంటుందా?"

"అవును"

"ఆ తరువాత మీ బ్రతుకుతెరువు మాటేమిటి?"

"పిచ్చివాడిలాగున్నావే! అప్పులంటే కేవలం గేదెలొక్కటే అనుకున్నావా? గేదెలు, ఆవులు, మేకలు, గొర్రెలు, కోళ్ళు, పిట్టలు, చేపలు, కప్పలు- ఎన్ని రకాలు కావాలంటే అన్ని రకాల లోన్లు దొరికుతాయ్. సంవత్సరానికి నాలుగు లోన్లు దొరికితే చాలు. హాయిగా గడిచిపోతుంది. జీవితం-"

ఇద్దరం బస్‌స్టాండ్‌కి చేరుకున్నాం. అక్కడ చెట్టుకింద ఓ ముసలాడు గోచీపెట్టుకుని, చిరిగిన బనీనుతో నిలబడి ఉన్నాడు. అతని పక్కనే ఓ బక్కచిక్కిన స్త్రీ నిలబడి సన్నగా రోదిస్తోంది. పొడుగాటి పిగిలిపోతున్న చీరముక్కను తన ఎండిన శరీరానికి చుట్టుకుని ఉందామె. ఆమె చంకలో మూడేళ్ళ పిల్లడు మూలుగుతున్నాడు. చిరుగుల దుప్పటి ముక్కతో వాడికి కప్పినా, వాడి పెద్దతల సన్నగా చీపురు పుల్లల్లా ఉన్న కాళ్ళూ చేతులూ, బయటకు పొడుచుకొచ్చిన బొమికలూ స్పష్టంగా కనబడుతన్నయ్.

"ఏంట్రా ముసలయ్యా- ఏమయింది?" అతన్నడిగాడు రామచంద్రం.

"పదిరోజుల్నుంచీ ఆ పిల్లడికి తిండిలేదు. నిన్న సందేళనుంచీ ఆడి ఒళ్ళు అగ్గిలాగా కాల్తాంది. పట్నం తీసుకెళ్ళి పెభుత్తాసుపత్రిలో సేరుద్దామనీ-" అన్నాడతను.

నాగుండె కలచివేసినట్లయింది వాళ్ళ పరిస్థితి చూస్తూంటే.

"వీళ్ళు కూడా మీ ఊరివాళ్ళేనా?" అడిగాను రామచంద్రాన్ని.

"అవును"

"ఇంత దారుణమయిన పరిస్థితిలో వీళ్ళుంటే- బాంక్‌లూ, ప్రభుత్వమూ ఎవరూ వీళ్ళకి సహాయం చేయరా?"

రామచంద్రం చిరాకుపడ్డాడు.

"ఛూత్-ఏం ప్రశ్నరా ఇది! అందుకే మీ నిర్భయ్‌నగర్ కాలనీవోళ్ళు-"

వాడిమాట పూర్తి కాకుండానే బస్ వచ్చింది. నేను ఎక్కాను. ఆ ముసలాడూ, ఆ స్త్రీ కూడా ఎక్కబోయారు గానీ కండక్టర్ ఎక్కనీలేదు.

"మీ పాసింజర్ వెనుక వస్తోంది- అందులో ఎక్కండి! ఇందులో చార్జీలు ఎక్కువ-" అంటూ బెల్ కొట్టాడు. వెళ్ళుతున్న బస్‌లోనుంచి వాళ్ళవేపు చూడ్డానికి ప్రయత్నించాను గానీ బస్ లేపిన దుమ్ములో వాళ్ళ ఆకారాలు కనిపించలేదు.



